# తెరచాటు

సునీత అరగంట నుంచి అద్దంముందు నిలబడి బ్లౌజు సర్దుకుంటోంది. ముందుకు లాగినా, వెనక్కి తోసినా కిందకి సర్దినా, ఏం చేసినా, అందంగా సూటిగా బయటకి చూస్తూనే వుంది. మోకాళ్ళ వరకు వున్న పింక్ స్కర్టుమీద లేతగులాబీ రంగుతో కుట్టిన అధునాతనమైన ఆ జాకెట్ ఎలా అమర్చుకోవాలో తెలీడంలేదు. లోపల బాడీ బిగించినా పొంగి వస్తున్న యవ్వనం పోటీ పడుతూనే వుంది!

సునీత అవస్తపడుతోంది. ఆమె పెద్దమనిషై రెండేళ్ళు దాటుతోంది. సీనియర్ యింటర్ పరీక్షలు వ్రాసింది. ఆమె యింతవరకు మినీస్కర్టులే వేస్తోంది.

వసుంధరకి కూతురు పరికిణీ, ఓణీలు వేసుకోవడం యిష్టం వుండదు. తన కూతురు పెద్దగా, ఆరిందలా కనిపిస్తే ఆమెకి బాధగా వుంటుంది. అందులో ఆమెకి తన వయసు కనిపిస్తుందేమో! ఆ తల్లి దృష్టిలో సునీత ఎప్పుడూ పధ్నాలుగేళ్ళ బాలిక – అంతే –

సునీతకి ఈ విషయంలో యిదీ అని ఒక అభిప్రాయం లేదు. కొన్ని విషయాల్లో అమ్మ మాట వినకపోయినా, డ్రస్సు విషయంలో మాత్రం తు.చ. తప్పకుండా వింటుంది? తను గంతులేసినా, పరుగులు పెట్టినా ఎవరితో ఎలా షికార్లు కొట్టినా అమ్మ అడ్డుచెప్పదు. తనొక చిన్నపిల్ల అన్నట్లు వ్యవహరిస్తుంది. తనతోటిదే రాజ్యలక్ష్మి. అమ్మో! వాళ్ళమ్మ ప్రతీదాన్ని సాగలాగి దుంప తెంచుతుంది. ఎప్పుడూ పరికిణీ మీద ఓణీ వేసుకోవల్సిందే. ముచ్చటకైనా మరో మాట మాట్లాడితే వూరుకోదు. తనకా విషయంలో హాయి – నెలకి మూడు రోజులు కాస్త జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటే

చాలు–, అయినా అప్పటికి కావలసిన సలహాలు, సరంజామా అమ్మ ఎప్పుడూ సిద్ధంగా ఉంచుతుంది – ఇదీ సునీత ఆలోచన. అందుకే ఆమె తల్లి చెప్పినట్లే డ్రస్ చేసుకుంటుంది–

అయితే అనుకోకుండా సునీతలో చిత్రమైన మార్పు వచ్చింది – అదీ, నాలుగు రోజుల క్రితం –

❖ ❖ ❖

ఆ రోజు సునీత, రాజ్యం కలిసి సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు. వసుంధర ఎప్పుడూ పెద్దగా అభ్యంతరం పెట్టదు. కారణం ఆమెకి రాజ్యలక్ష్మి అంటే యిష్టమే.

ఆ అమ్మాయి ఫస్టుక్లాసు స్టూడెంట్. అందుకే అప్పుడప్పుడు.

పల్లెటూరి వాలకమైనా బుర్ర పదునైనదే" అంటూ కామెంటు చేస్తూ వుంటుంది.

సునీత సినిమా టైముకి కారు పంపమని వాళ్ళ డాడీకి చెప్పింది, ఆయనలాగే పంపారు.

సునీత "అమ్మా నువ్వూ రావే" అంది.

నిజానికి సునీత తల్లి రావాలని అడగలేదు. తనూ, రాజ్యం కనిపించిన ప్రతీ కుర్రాడినీ ఏడిపించటానికి, ఉడికించటానికి వీలుందదు తల్లి వుంటే –, అయినా వూరికే అడిగింది.

వసుంధర కూడ చిన్న పిల్లలతో బయలుదేరదు. అందుకే రానంది.

సునీత హుషారుగా కారెక్కింది. అయిదు నిముషాల్లో కారు రాజ్యం ఇంటి ముందు ఆగింది. రాజ్యలక్ష్మి చక్కగా ముస్తాబయి వుంది. వొదులుగా జడ, మెరుస్తున్న ఎర్రరాళ్ళ దుద్దులు కళ్ళకు సన్నగా కాటుక, తీర్చిన బొట్టు. బట్టలు మాత్రం మార్చు కోలేదు, సునీతని చూసి ఎగిరిగంతేసింది.

"అబ్బ! ఇంత ఆలస్యమా! నీ కోసం చూసి, చూసి, యింక రావేమో అనుకుంటున్నా" అంది గారంగా.

"ఎంతసేపూ నా మీదే నీ ఏడుపు. నువ్వెంత రెడీగా వున్నావో చూడు! ఆ బట్టలూ, నువ్వూనూ" అంటూ దబాయించింది సునీత.

"ఎంత ఒక్కక్షణం" అంటూ పరుగెట్టబోయి సునీత చెయ్యి పట్టుకుంది.

"ఓ మైగాడ్! అప్పుడే ఆరైపోతోంది" అంటూ రాజ్యలక్ష్మి అనుసరించింది సునీత.

మేడమీద గదిలోకి లాక్కుపోయింది రాజ్యం. బీరువా తీసి అందులోంచి నాలుగు

పట్టు పరికిణీలు తీసి ముందు మంచం మీద పడేసి "సుని, ప్లీజ్, ఏది కట్టుకోనో చెప్పు, క్విక్, ఒన్ మినిట్‌లో చెప్పాలి" అంది జాకెటు గుండీలు టపటప లాగేస్తూ.

ఎర్రటి ఎరుపు మీద ఆకు పచ్చ జరీ అంచు - తెల్లటి తెలుపు, ఎర్రటి జరీ - ముదురాకుపచ్చ మీద జరీ బుటా - పసుపుపచ్చ నల్లటి జరీ -

ఎర్రటి పరికిణీ తీసి రాజ్యానికిస్తూ "యిదిగో త్వరగా" అంటూ తొందరచేసి, పక్కనే వున్న తెల్లటి పట్టు పరికిణీ చేత్తో సున్నితంగా తాకుతూ "ఇది చాలా బాగుంది రాజీ" అంది. ఆ అనడంలో ఎంతో ఆడతనం, ఎంతో నాజూకుతనం వుంది. అటు తిరిగి జాకెటు మార్చుకుంటున్న రాజ్యం చటుక్కున భుజాలమీదుగా వెనక్కి తిరిగి చూసింది జాకెట్ చివరి హుక్ పెట్టేసి సునీత వైపు తిరిగి ఆమెభుజాల మీద చేతులు వేసి "డియర్ సునీ - ఈ వేళ నే చెప్పినట్లు వినాలి. అంటే నువ్వీ లంగా ఓణీ వేసుకో - ప్లీజ్, నీకెంతో బాగుంటుంది. ఇద్దరం కలిసి ఒకేలా వెళ్దాం, ఏం? సునీ యాజ్ ఎ గుడ్ గరల్" అంటూ తొందరచేసింది.

సునీతకి మనసులో వేసుకోవాలని వుంది. ఎప్పటి నుంచో మనసులో వున్న కోరిక, ఆ అనుభవం తనకి కొత్త, వక్కసారి వేసుకుందామనే వుంది. అయితే అది రాజ్యంది అయినా రాజ్యం పరాయిది కాదు. తన ప్రాణ స్నేహితురాలు, ఇద్దరి మధ్యా అసలు తేడా లేదు. దాని బట్టలు తను వేసుకుంటే తప్పేమీ లేదనిపించింది. సునీత ఆలోచన తెగకుండానే -

"క్విక్ సునీ, టైము చూడు" అంటూ కంగారుపెట్టేసింది రాజ్యం.

సునీత బట్టలు మార్చుకుంది, మెత్తగా అందంగా ఓణీ గుండెల్ని కప్పుతుంటే సునీతకు కొత్తగా, చిత్రంగా అనిపించింది. తన గుండెలు పల్చటి వల్లెవాటులోంచి చూస్తే అందంగా హుందాగా వున్నట్లనిపించింది, వక్షస్థలం మీద సుతారంగా కదిలిన ఓణీ గిలిగింతలు పెట్టింది. ఆ గిలిగింతలు గుండెలో కూడ కలవరపెట్టాయి. చేత్తో రెండు మూడుసార్లు ఓణీ సర్దుకుంది. మేలి ముసుగులోంచి ముగ్ధమోహన కాంత ధైర్యంగా కళ్ళెత్తి చూసినట్లు సునీతలోని యవ్వనం ధైర్యంగా పొంగింది. ఆమె బరువుగా వూపిరి తీసుకుంది.

ఎంతో ఎత్తుగా, పొడుగ్గా, దిద్దిన బొమ్మలా వుండే సునీత ఆ దుస్తుల్లో అప్సరసలా వుంది. రాజ్యం అదే అంటూ బుగ్గ మీద చిటికె వేసింది.

ఇద్దరూ సినిమాహాలు చేరారు. సుధీర్, చంద్ర టిక్కెట్లు తీసుకుని రెడీగా వున్నారు.

"మిమ్మల్ని ఎవరు టిక్కెట్లు కొనమన్నారు?" అంటూ దెబ్బలాడడం మొదలెట్టింది రాజ్యలక్ష్మి. సుధీర్ ఆమెకి ఎలాగో సర్దిచెప్తున్నాడు –

"నో – ఐ డోంట్ ఎగ్రీ" అంటోందామె. చంద్రం మాత్రం మాటలు మర్చిపోయినవాడిలా నిలబడిపోయాడు.

సుధీర్ చిట్టచివరికి "పోనీ డబ్బులిచ్చేయ్" అన్నాడు విసిగి. అంతా నవ్వుకున్నారు. అంతవరకు సునీతని రెప్పవెయ్యకుండా చూస్తున్న చంద్ర వులిక్కిపడి వాళ్ళ నవ్వులతో శృతి కలిపాడు.

చంద్ర తననే పరీక్షగా చూడడం సునీత గ్రహించినా, అతనెందుకలా చూశాడో అర్థం కాలేదు.

కాని అతనలా తనలోకి చూస్తుంటే తనకెందుకో గర్వంగా అనిపించింది. రోజూ దాపరికం లేకుండా వుండే తను యీ రోజు ఈ తెరచాటుతో ఎంతో కొత్తగా అయిపోయింది. మనసూ తనువూ నిండుగా వున్నట్లనిపించింది! సునీతకి ఆ రోజంతా కొత్తగా మరో ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా – అనుభూతి పొందింది. తల్లి తనని ఎంతో అధునాతనంగా వుంచినా తనలో నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఆచారాన్ని తుడిచివెయ్యలేకపోయింది – ఇలా కాకుండా మరోలా తనుండలేదని పించింది.

అమ్మ శాంతా ఆంటీకి ఫోన్ చేసి తనకి కారు డ్రైవింగ్ నేర్పటానికి చంద్రని రమ్మంది. చంద్ర గంటలో వస్తాడు. మళ్ళీ యీ మినీస్కర్టుతో అతని ముందుకెళ్ళాలంటే ఎంతో సిగ్గుగా వుంది–

అమ్మతో తనకి పరికిణీలు కొనమని గొడవ చేసింది.

"చాల్లే ఆరిందాలా, ఇప్పుడేం కంగారు. వెధవ ముసలి డ్రస్సులూ నువ్వూ – నీకెప్పుడేది కొనాలో నాకు తెలుసు. నువ్వేమీ చెప్పకు" అని కసిరి – ఒక్క క్షణం ఆగి

"ఏం ఎవరేనా అన్నారా?" అంది.

ఆ మాటకి సునీతకి చర్రున కోపమొచ్చింది.

"ఎవరూ చెప్పకపోతే నాకే అనిపించకూడదా!" అంది విసురుగా –

వసుంధర తేలిగ్గా శ్వాసవదిలి "మరేం మునిగిపోలేదులే – నే చెప్పినట్లు విను" అని తోసిపారేసింది.

చంద్ర పదినిముషాల్లో వచ్చేస్తాడు. తను అతనిముందుకెలా వెళుతుంది–

అద్దం ముందు సునీత అలాగే కూర్చుంది. తెల్లని ముత్యాలదండ గుండెల మీదకి జారి, రెండూ ఒకటిగా గుండెల మధ్యకి, మెలికపడి మెరుస్తున్నాయి. పల్చటి బ్లౌజు గాలికి రెపరెపలాడుతోంది.

"హల్లో! రెడీయేనా" అంటూ చంద్ర రానే వచ్చేశాడు-

సునీత తత్తరపడింది. సిగ్గుతో మనసు కుంచించుకుపోయింది. అనుకోకుండా సునీత రెండు చేతులు 'యింటూ'లా భుజం మీద చేర్చి గుండెలు కప్పుకుని అతనివైపు తిరిగింది.

("జ్యోతి" మాసపత్రిక నుండి)